క్లుప్తంగా

వర్షాల కోసం ప్రత్యేక పూజలు



ఉరలోవకొండపై ఉన్న గుండానికి పూజలు చేస్తున్న మహిళలు

రావికమతం: వర్షాలు కురవాలని కోరుతూ కొమిర ఉరలోవ కొండపై ఉన్న గుండం(చెలమ)కు గిరి మహిళలు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. కొండపై ఉన్న గుండానికి పూజలు చేయడం పూర్వ కాలం నుంచి ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు. వర్షాలు కురవక వరి నారు ఎండిపోతుండడంతో గుండానికి పాలు, పూలతో పూజ చేసి, నివేదన చేశామన్నారు.

పోలవరంలో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



పోలవరంలో భూమి పూజ చేస్తున్న నాయకులు

గొలుగొండ: పాతమల్లంపేట పంచాయతీ శివారు గిరిజన గ్రామమైన పోలవరంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టారు. రూ.5 లక్షల వ్యయంతో పనులు ప్రారంభించారు. సోలార్ సిస్టంతో తాగునీరు అందించేందుకు బుధవారం భూమి పూజ చేశారు. స్థానిక మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, మాజీ వార్డు మెంబర్ బోయిన సీతమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ సూపర్‌వైజర్ రాము ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు.

ముమ్మరంగా వరినాట్లు



అయ్యన్నపాలెం ప్రాంతంలో వరి నాట్లు వేస్తున్న రైతులు

గొలుగొండ: రావణాపల్లి జలాశయం దిగువున ముమ్మరంగా వరినాట్లు జరుగుతున్నాయి. ఈ జలాశయం నుంచి నర్సీపట్నం, గొలుగొండ మండాల పరిధిలో సుమారు 1200 ఎకరాలకు వారం రోజుల క్రితం నీరు విడుదల చేయడంతో రైతులు నాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. మరో వారం రోజుల్లో ఈ జలాశయం దిగువున ఉన్న అన్ని ప్రాంతాల్లో నాట్లు పూర్తి అయ్యే అవకాశం ఉంది.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు నోటిఫికేషన్

నర్సీపట్నం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇచ్చినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ఇవ్వవలసి ఉంటుందన్నారు. బీఏ (పొలిటిక్స్)-06, బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్)-22, బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్)-17, బీఎస్సీ (ఫిజిక్స్)-38, బీఎస్సీ(బోటనీ)-17, బీఎస్సీ(కెమిస్ట్రీ)-20 సీట్లు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

గొలుగొండ: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని, గ్రామాల్లో ఎవరూ బాలలతో పనిచేయించరాదని కోరుతూ బుధవారం ఇక్కడ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గొలుగొండ ఐసీడీఎస్ పీవో శ్రీగౌరి మాట్లాడుతూ బాలకార్మికులు లేని సమాజం కోసం కలసికట్టుగా పనిచేయాలన్నారు.

గొల్లలపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

కె.కోటపాడు : మండలంలోని గొల్లలపాలెంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల 139 మందికి వైద్య పరీక్షలు జరిపారు. ఎంపీహెచ్ఈవో రవికుమార్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్ల సదుపాయంతోనే గ్రామాల అభివృద్ధి



బుచ్చెయ్యపేటలో రోడ్డు పనులకు శంకుస్థాపనలో పాల్గొన్న విప్ ధర్మశ్రీ



కొంతలం-శరభవరం తారు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: గ్రామీణ ప్రాంతాలకు రోడ్ల సదుపాయం కలిగినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. రూ.1.75 కోట్లతో చేపట్టిన కేపీ అగ్రహారం తారు రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం బుచ్చెయ్యపేటలో ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చోడవరం మండలం తిమ్మనపాలెం రోడ్డు నుంచి పోలేపల్లి,బుచ్చెయ్యపేట, పైడంపేట, ఐయితంపూడి, కేపీ అగ్రహారం,రావికమతం మండలం మట్టవానిపాలెం రోడ్డు వరకు తారు రోడ్డు నిర్మించడం వల్ల మూడు మండలాల ప్రజలకు, రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని గ్రామాలకు పక్కా రోడ్లు ఏర్పాటవడంతో రైతులకు రవాణా సదుపాయం కలిగి గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయని చెప్పారు. బుచ్చెయ్యపేట మండలంలో అన్ని గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించినట్టు తెలిపారు. కొమళ్లపూడి,మల్లాం ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు పలువురు ఆసక్తి చూపుతున్నారని, త్వరలోనే బుచ్చెయ్యపేట మండలం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి,గొంపా చినబాబు,డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు,సర్పంచ్‌లు సీతా బుజ్జి, గోపిశెట్టి శ్రీను,పెద్దాడ నాయుడు,పినపోలు రామునాయుడు,సుంకరి లక్ష్మి, కోవెల ఈశ్వరరావు,సుంకరి శ్రీను,గాంధీ,డీఈ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం-శరభవరం రోడ్డుకు శంకుస్థాపన

రోలుగుంట: భోగాపురం నుంచి కొంతలం మీదుగా శరభవరం వరకు తారు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ , ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు.ఈ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.86.41 లక్షలు మంజూరు చేసింది. ధర్మశ్రీ మాట్లాడుతూ రహదారుల సమస్య పరిష్కారంపై ప్రభుత్వందృష్టి సారించినట్టు చెప్పారు. కొంతలం సర్పంచ్ వంశీ, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ దోసపల్లి వరలక్ష్మి, జెడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మ, ఇక్కడ నాయకులు రాజు, పంచాడ చినరాయుడు తదితరులు భోగాపురం-శరభవరం రోడ్డు సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని దీంతో నిధులు మంజూరు చేయించానని చెప్పారు. త్వరలోనే బీబీ పట్నం -గైరంపేట రోడ్డు పనులు కూడా పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కంచుగుమల ఎంపీటీసీ వద్దాది సతీష్, కొంతలం సర్పంచ్ కుంచంగి వంశీ చంద్ర, మాజీ సర్పంచ్ కుంచంగి హరిబాబు, ఎంపీటీసీ బంటు దుర్గారమణి, కంచుగుమల మాజీ సర్పంచ్ బండారు రాజేశ్వరి, కొమరవోలు ఎంపీటీసీ గొర్లె వెంకటరామన్ తదితరులు పాల్గొన్నారు.

ద్వారకానగర్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు

చోడవరం: స్థానిక ద్వారకానగర్‌లో సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్టు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చెప్పారు. ద్వారకానగర్ ప్రాంతంలో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. పబ్లిక్ కుళాయిలు వేయాలని స్థానిక మహిళలు కోరారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నారాయణరావును ఎమ్మెల్యే ధర్మశ్రీ ఆదేశించారు. అంతర్గత రోడ్లు, ఇతర సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తామని ధర్మశ్రీ చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యదర్శి పందిరి శ్రీనివాసరావు, వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కందర్ప శంకర్ ఉన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

మండల సమావేశంలో ఎంపీపీ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యనారాయణ

మాకవరపాలెం: గ్రామాల్లోని సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ అధికారులకు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు చిత్రపటానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. విద్యుత్‌శాఖ ఏఈ బాలకృష్ణ మాట్లాడుతూ మండలంలోని జి.కోడూరు, బూరుగుపాలెం గ్రామాల్లో సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. దీంతోపాటు 100 అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర విద్యుత్ సంబంధిత పనులకు రూ.10 కోట్లతో ప్రతిపాదనలు చేసినట్టు తెలిపారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు ఉచితంగా విద్యుత్ మీటర్లు అందిస్తున్నట్టు చెప్పారు. ఏవో చిరంజీవి మాట్లాడుతూ ఈ ఖరీఫ్‌లో 98 క్వింటాళ్ల వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేసినట్టు చెప్పారు. ప్రతి రైతు తమ పాసుపుస్తకాలకు ఆధార్ నంబర్ లింక్‌తోపాటు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. లేకుంటే ప్రభుత్వ రాయితీలు మంజూరు కావని తెలిపారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు పెట్ల సత్యవేణి, వైస్ ఎంపీపీలు లక్ష్మి, రాజారావు, ఎంపీడీవో అరుణశ్రీ, తహసీల్దార్ ప్రసాద్, ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

వరికి పాముపొడ తెగులు



పైడిపాలలో పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మాకవరపాలెం: వరిపంటకు పాముపొడ తెగులు సోకినట్టు యలమంచిలి వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త అప్పలస్వామి, బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త నాగేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని పైడిపాల, గిడుతూరు, మాకవరపాలెం గ్రామాల్లో వరిపొలాలను బుధవారం వారు సందర్శించారు. వరిలో పాముపొడ తెగులు ఉన్నట్టు గుర్తించారు. గరిక, తీగజాతి, తుంగ, అంబటి కాడ వంటి కలుపు మొక్కలను కూడా గుర్తించారు. పాముపొడ తెలుగులు నివారణకు హెక్సాకొనజోల్ మందును లీటరు నీటి 2 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. కలుపు నివారణకు ఎకరానికి బిస్ పైరీబ్యాక్ సోడియం మందు 100 ఎంఎల్, ఆల్ మిక్స్ 8 గ్రామాల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు శిక్షణ కేంద్రం ఏవో విజేత, ఏఈవో శేషునాయుడు, సిబ్బంది రాజా, నవీన, తినాథ్ పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలిగా రమాదేవి



రమాదేవిని సత్కరిస్తున్న వైఎస్సార్ క్రాంతి పథం సభ్యులు

దేవరాపల్లి: వైఎస్సార్ క్రాంతి పథం మండల మహిళా సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా దేవరాపల్లికి చెందిన గొర్రుపోటు రమాదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఏపీఎం ఎస్.ప్రభాకర్ ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యుల ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షురాలిగా కడారి గౌరి, కార్యదర్శిగా కురందాస్ పైడిపద్మ, ఉప కార్యదర్శిగా కె.లీలా మహేశ్వరీ, కోశాధికారిగా గనివాడ పద్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రమాదేవిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతి పథం లీగల్ కోఆర్డినేటర్ ఉమా ప్రసాద్, సీసీలు గౌరీశ్వర్, సత్యనారాయణ, పైడిబాబు, సరోజిని, ఈశ్వరమ్మ, అకౌంటెంట్ పార్వతీదేవి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషా వారోత్సవాలు ప్రారంభం



భాషా వారోత్సవాలు ప్రారంభిస్తున్న ఎంపీపీ రుత్తల



గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈవో పడాల్‌దాస్, కళాశాల ప్రిన్సిపాల్ రాధ

మాకవరపాలెం: తెలుగు భాషా వారోత్సవాలను ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, జెడ్పీటీసీ సత్య వేణి బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాలతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు భాష ఔన్నత్యానికి ఆయన చేసిన కృషిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుణశ్రీ, తహసీల్దార్ ప్రసాద్, ఎంఈవోలు లక్ష్మి, మూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, పార్టీ నేతలు భద్రాచలం, మూకల బాలకృష్ణ పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తి సేవలు చిరస్మరణీయం

దేవరాపల్లి: తెలుగు వ్యవహారిక భాష పితామహులు గిడుగు వెంకట రామ్మూర్తి సేవలు చిరస్మరణీయమని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఇన్‌చార్జ్ ఎంఈవో-1 బి. పడాల్ దాస్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.రాధతో కలిసి ఆయన గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. తెలుగు భాషా అభివృద్ధికి గిడుగు రామ్మూర్తి చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు పద్య పఠన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

చూడి గేదెకు అత్యవసర చికిత్స



గేదెకు చికిత్స చేస్తున్న పశువైద్యురాలు అలేఖ్య

రోలుగుంట: మండలంలోని కొవ్వూరు గ్రామంలో కంర్రెడ్డి రమణకు చెందిన చూడి గేదెకు రావికమతం మండలం సంచార పశు వైద్య వాహన వైద్యురాలు అలేఖ్య అత్యవసర చికిత్స అందజేశారు. గేదె కడుపులో పెయ్యి అడ్డం తిరిగి తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో రమణ 1962 కాల్ సెంటర్‌ను సంప్రదించాడు. పశు వైద్యురాలు అలేఖ్య కొవ్వూరు వెళ్లి గోపాలమిత్ర ఐ.వి.రాజు సహకారంతో గేదె గర్భంలో పెయ్యిని సరిచేసి బయటకు తీశారు. దీంతో గేదెకు ప్రాణాపాయం తప్పింది. పెయ్యి చనిపోయింది. సిబ్బంది మహేష్, శివ, బాలాజీ, ప్రసాద్ పైలెట్ రామకృష్ణ సేవలందించారు. ఈ సందర్భంగా రోలుగుంట పశువైద్యుడు నూకేశ్వరరావు మాట్లాడుతూ సంచార పశువైద్య సేవలను పాడి రైతులు వినియోగించుకోవాలని తెలిపారు.

కిచెన్ గార్డెన్‌లపై మహిళలకు అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం లచ్చన్న

చీడికాడ: కిచెన్ గార్డెన్‌ల ఏర్పాటుపై మహిళలకు అవగాహన కల్పించి, వాటివల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం సి.హెచ్.లచ్చన్న తెలిపారు. స్థానిక రైతు సాధికార సంస్థ,ఐసీఆర్‌పీలు,మహిళా సమాఖ్య వీఓఏ లతో ప్రకృతి సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా రైతులు, డ్వాక్రా సంఘాల సభ్యులకు ప్రకృతి వ్యవసాయంతో పాటు కిచెన్‌గార్డెన్‌ల ఏర్పాటు నిర్వహణ,దాని వల్ల కలిగే ప్రయోజనాలు వివరించాలన్నారు. కిచెన్ గార్డెన్ల ఏర్పాటుపై ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసాధికార సంస్థ ఆర్‌టీడీ హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



నాగరాజుకు నగదు అందజేస్తున్న మిత్రులు

రావికమతం: తమ స్నేహితుడి కుమారుడి ఆరోగ్యం బాగోలేదని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న పూర్వవిద్యార్థులు స్పందించి తక్షణ సాయంగా రూ.40 వేలు సమకూర్చారు. గర్నికం గ్రామానికి చెందిన మెలిపాక నాగరాజు కుమారుడు తారకేష్(3)మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతూ విశాఖలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆ బాలుడి వైద్యానికి రూ.5లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు.

నాగరాజు మిత్రుడొకరు ఆ విషయాన్ని పదవ తరగతి మిత్రుల గ్రూపులో పోస్టు చేయడంతో అందరూ స్పందించారు. రూ.40 వేలు సమకూర్చారు. ఆ మొత్తాన్ని సూరిబాబు, నాయుడు,దుర్గారావు, శివశంకర్ బాలుడు చికిత్స పొందుతున్న ఆస్పత్రికి వెళ్లి తన మిత్రుడికి అందజేశారు.

సచివాలయ భవన నిర్మాణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న రాజారామ్

మాడుగులరూరల్: పోతనపూడి సచివాలయ భవన నిర్మాణ పనులను వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు ఈ భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. పీఏసీఎస్ పర్సన్ఇన్‌చార్జి కోరుకొండ చెల్లంనాయుడు పాల్గొన్నారు.

జిల్లా రైతు విభాగం అధ్యక్షుడికి ఎంపీపీ పరామర్శ



పరామర్శిస్తున్న ఎంపీపీ జయమ్మ

చీడికాడ: ఇటీవల గుండెపోటుకు గురైకోలుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు,పార్టీ సీనియర్ నేత యర్రా అప్పారావును బుధవారం ఎంపీపీ కురచా జయమ్మతో పాటు పార్టీ నేత సుంకర శ్రీను చీడికాడలో పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మాడుగుల: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో రెండు ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీవో వి.ఈశ్వరమ్మ తెలిపారు. మాడుగుల అంగన్‌డీ కేంద్రం-4లో ఆయా పోస్టుకు బీసీ-ఎ కి, చీడికాడ మండలం శిరిజాం పంచాయతీ సూర్యనారాయణ పురం అంగన్‌వాడీ కేంద్రం ఆయాపోస్టు బీసీ-బికి కేటాయించినట్టు చెప్పారు. 10 వ తరగతి ఉత్తీర్ణులైన, అదే గ్రామానికి చెందిన వివాహిత మహిళలు అర్హులని చెప్పారు. అర్హులైన వారు ఈ నెల 29వ తేదీలోగా స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో స్వయంగా గాని, రిజిస్టర్ పోస్టు ద్వారాగాని దరఖాస్తులు అందజేయాలన్నారు.

రోలుగుంట: మండలంలోని జె.నాయుడుపాలెం-2 లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టు భర్తీ కి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ రావికమతం సీడీపీవో జి.ఉషారాణి తెలిపారు. ఈ పోస్టును బీసీ-బి కి కేటాయించినట్టు చెప్పారు. ఈ నెల 29 లోగా రావికమతం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

రావికమతం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పీవో ఉషారాణి బుధవారం తెలిపారు. నర్సయ్యపేట(ఓసీ), రాజాం(బీసీ-డి),గాంధీగ్రామం-3(ఎస్సీ),జె.నాయుడుపాలెం(బీసీ-బి)టి.అర్జాపురం-1(ఓసీ)లో పోస్టులు ఖాళీగా ఉన్నట్టు చెప్పారు. ఈ నెల 28వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

97 శాతం ఓటరు వెరిఫికేషన్ పూర్తి

మాడుగులరూరల్: ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్నిఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్టు తహసీల్దార్ పి.వి.రత్నం తెలిపారు. మండలంలో 55,687 మంది ఓటర్లు ఉండగా ఇంతవరకు 97 శాతం వెరిఫికేషన్ పూర్తయినట్టు చెప్పారు. గడువులోగా శతశాతం వెరిఫికేషన్ పూర్తి చేస్తామని తెలిపారు.

30 నుంచి సీపీఎం నిరసన

కె.కోటపాడు : కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ఈ నెల 30 నుంచి వచ్చేనెల 4 వరకూ నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు సీపీఎం మండల కార్యదర్శి యర్రా దేముడు తెలిపారు. నిరసన కార్యక్రమాల వాల్‌పోస్టరును గొండుపాలెంలో ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమాలను యువత, రైతులు విజయవంతం చేయాలని కోరారు.

బ్రహ్మాస్త్రం,నీమాస్త్రం తయారీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న గుణవతి

రావికమతం: వరి పంటకు అధిక నష్టాన్ని కల్గించే పెద్ద పురుగు,గొంగళి పురుగులను నాశనం చేసి, పంట ఎదుగుదలకు, దిగుబడికి బ్రహ్మాస్త్రం ద్రావణం ఎంతగానో ఉపయోగ పడుతుందని ప్రకృతి వ్యవసాయం రిసోర్స్ పర్సన్ గుణవతి అన్నారు. కొత్తకోట,దొండపూడి గ్రామాల రైతులకు బ్రహ్మాస్త్రం,నీమాస్త్రం తయారీపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ కషాయాలు పంటకు మేలు చేస్తాయని చెప్పారు.

మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌సీఎం సిస్టర్స్, విద్యార్థులు

మాడుగుల: మణిపూర్ రాష్ట్రంలో జరిగిన ఘటనకు వ్యతిరేకంగా స్థానిక సెయింటెన్స్ సుపీరియర్ సిస్టర్ సలీనా ఆధ్వర్యంలో మాడుగులలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీటీ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీఎం పాఠశాల విద్యార్థినులు నవజీవన స్రవంతి డైరెక్టర్ సలీష్టీనా, ఆర్‌సీఎం సిస్టర్స్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు విస్తృత ప్రచారం



ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తహసీల్దార్ శ్రీనివాస్ నాయుడు

నాతవరం: బాల్యవివాహాలు నిర్మూలించేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం సీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రధాన కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాల నిర్మూలనకు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పట్టణ ప్రాంతాలు కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే అధికంగా చిన్న వయస్సులో పెళ్లిళ్లు జరుగుతున్నట్టు చెప్పారు. తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ ఐసీడీఎస్ అధికారులు, సీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు సంయుక్తంగా అనేక బాల్య వివాహాలు అడ్డుకున్నారని చెప్పారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం అనేక అనర్థాలు వస్తాయని తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, ఐసీడీఎస్ నాతవరం, గన్నవరం సెక్టారు సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, నాగజ్యోతి, సీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటరు జి.మహాలక్ష్మి, డివిజన్ కోఆర్డినేటరు లక్ష్మీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు సత్యవతి, వసంత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి జయంతి



టంగుటూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు

నర్సీపట్నం: ఆర్డీవో కా ర్యాలయంలో బుధ వారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆర్డీవో హెచ్.వి.జయరాం, సిబ్బంది ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్డీవో కార్యాలయం ఏవో సూర్యనారాయణ పాల్గొన్నారు. వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. ఎన్టీఆర్ స్టేడియంలోని టంగుటూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్లబ్ కార్యదర్శి ఎం.ఎస్.ప్రసాద్, ఉపాధ్యక్షుడు కామిరెడ్డి సత్యనారాయణ, అల్లు అప్పారావు, పిట్ల శ్రీనవాసరావు పాల్గొన్నారు.